బుధ వారం
24-01-2024
సంపుటి - 09,
సంచిక - 438
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra
Pradhesh

CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

జాతీయ తెలుగు వార్త పత్రిక

❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## మేం పార్టీ మారడం లేదు

సమస్యలపై చర్చకు సిఎం రేవంత్‌తో భేటీ

ఉమ్మడి మెదక్ జిల్లా బిఆర్ఎస్ ఎమ్మెల్యేల వెల్లడి




**హైదరాబాద్, జనవరి 24 (సమ సమాజం):** తాము పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఖండించారు. మంగళవారం సీఎంను కలిసి నియోజకవర్గాల సమస్యలు పరిష్కరించాలని, ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరినట్లు స్పష్టం చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డిని కలవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే కె.మాణిక్ రావు మంగళవారం సాయంత్రం సీఎంను ఆయన నివాసంలో కలిశారు. ఒకేసారి నలుగురు ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలు రేవంత్ ను కలవడంపై ఆసక్తి నెలకొంది. వారు పార్టీ మారుతున్నారంటూ పెద్ద ఎత్తున ప్రచారం సాగింది.
దీనిపై తెలంగాణ భవన్ లో బుధవారం మీడియాతో

3వ పేజీలో...

## బిఆర్ఎస్‌లో ఆధిపత్య పోరు

మెదక్ సీటు కోసం కవిత పట్టు

అంతర్గత కుమ్ములాటల్లో కెసిఆర్ కుటుంబం

హరీష్ ప్రోద్బలంతోనే సిఎంతో ఎమ్మెల్యేల భేటీ

బిజెపి నేత రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు



**సిద్దిపేట, జనవరి 24 (సమ సమాజం):** మెదక్ ఎంపీ సీటుకోసం కేసీఆర్ కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయని బీజేపీ నేత, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మెదక్ నుంచి పోటీకి ఎమ్మెల్సీ కవిత పట్టుబడుతోందని అందుకే హరీష్ రావు బ్లాక్ మెయిల్ చేస్తున్నారని చెప్పారు. మెదక్ జిల్లాకు చెందిన నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సీఎం రేవంత్ రెడ్డి వద్దకు పంపించింది కూడా హరీష్ రావేనని అన్నారు. మెదక్ జిల్లాలో గెలుస్తామన్న భరోసాతోనే కవిత పట్టుదలతో ఉందని, దీనిని హరీష్ రావు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు హరీష్ రావుకు తెలియకుండానే సీఎంను కలిశారా అని రఘునందన్ ప్రశ్నించారు. వాళ్ళతో బలవంతంగా ప్రెస్ మీట్ పెట్టించారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు త్వరలో మొత్తం కాంగ్రెస్ లో చేరుతారని.. పార్లమెంట్ ఎన్నికల తరువాత బీఆర్ఎస్ జీరో అవుతుందని జోస్యం చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తరువాత కూడా బీఆర్ఎస్ పార్టీ నేతలకు జ్ఞానం రాలేదన్నారు. పార్టీ మీద పెత్తనం కోసం ఒకరిపై ఒకరు ఆధిపత్య పోరు జరుపుతున్నారని విమర్శించారు. అంతకుముందు సీఎం రేవంత్ రెడ్డిని కలవడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివరణ ఇచ్చారు. తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తాము

3వ పేజీలో...

## ప్రజలను అవమానించేలా పోస్టులు సరికాదు

సోషల్ మీడియాలో బాధ్యతగా వ్యవహరించాలి

బిఆర్ఎస్ సోషల్ మీడియా పోస్టులపై కెటిఆర్ చురకలు



**కరీంనగర్, జనవరి 24 (సమ సమాజం):** ప్రజలను కించపరిచేలా మాట్లాడొద్దని బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్‌కు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ప్రజలను తప్పుపట్టేలా పోస్టులు పెట్టవద్దన్నారు. ప్రజలు ఎప్పుడూ తప్పు చేయరని అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. '2001 ఏప్రిల్ 27 నాడు జలదృశ్యంలో పార్టీ పుట్టిన నాడు మొదటి సమావేశం జరిగింది. ఆ నాడు ఉద్యమానికి ఊపిరిలూదింది.. ఊపిరిపోసింది ఇదే కరీంనగర్ గడ్డ. ఎస్సారార్ కాలేజీలో ఆ నాడు 2లక్షల పైచీలుకు తెలంగాణ ప్రజలు కదిలివచ్చి.. తెలంగాణ ఉద్యమం సజీవంగా ఉంది.. తెలంగాణ నినాదం సజీవంగా.. తెలంగాణ రావాలన్న కోరిక బలంగా

3వ పేజీలో...

# సీఎం రేవంత్ రెడ్డితో బ్రిటిష్ హైకమిషనర్ భేటి



## మూసీ అభివృద్ధిపై చర్చించిన సిఎం

**హైదరాబాద్, జనవరి 24 (సమ సమాజం):** సీఎం రేవంత్ రెడ్డి బుధవారం సచివాలయంలో బ్రిటిష్ హై కమిషనర్ అలెక్స్ ఎల్లిస్‌తో భేటీ అయ్యారు. లండన్‌లోని థేమ్స్ రివర్ ప్రాజెక్టు తరహాలో హైదరాబాద్‌లో మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు చేపట్టనున్నట్లు సీఎం అలెక్స్ ఎల్లిస్‌తో తన ఆలోచనలను పంచుకున్నారు. ఇటీవల లండన్ పర్యటనలో అక్కడ థేమ్స్ నది నిర్వహిస్తున్న తీరు, రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు అభివృద్ధి చేసిన తీరును ప్రత్యేకంగా అధ్యయనం చేసినట్లు చెప్పారు. అదే మోడల్‌లో హైదరాబాద్‌లో మూసీ నదిని పునరుజ్జీవింప జేసేందుకు చేస్తున్న ప్రణాళికలను, ప్రాజెక్టుకు సంబంధించిన అవుట్ లైన్, థేమ్స్ నది తరహాలో అభివృద్ధి, తదితర అంశాలను ఆయనతో చర్చించారు. నదీ ఒడ్డున అభివృద్ధి కార్యక్రమాలతో పాటు నదీ సంరక్షణకు అత్యున్నత ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. పర్యావరణాన్ని కాపాడుతూ, సహజ వనరులకు విఘాతం లేకుండా మూసీ నదిని అభివృద్ధి చేస్తామని సీఎం అన్నారు. కాగా, రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్, ఎకో టూరిజానికి తమ సహకారం ఉంటుందని ఎల్లిస్ తెలిపారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, డిప్యూటీ హై కమిషనర్ గారేత్ వైన్ ఒవేన్, తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ ఇంట్లో ఏసీబీ సోదాలు

ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తింపు




హైదరాబాద్,జనవరి 24 (సమ సమాజం): హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ ఇంట్లో ఏసీబీ సోదాలు చేపట్టడం కలకలం రేపుతున్నది. బుధవారం హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. శివ బాలకృష్ణపై ఆదాయం మించి ఆస్తుల కేసును ఏసీబీ నమోదు చేసింది. ఈ క్రమంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 20 ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. అమీర్‌పేటలోని హెచ్ఎండీఏ కార్యాలయంలోనూ ఏసీబీ సోదాలు చేస్తోంది. శివ బాలకృష్ణ ఇళ్లు, బంధువుల ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. శివ బాలకృష్ణ తన పదవిని అడ్డం పెట్టుకొని కోట్ల రూపాయలు సంపాదించినట్లుగా ఏసీబీ గుర్తించింది. హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగంలో బాలకృష్ణ కీలక స్థానంలో పనిచేసిన విషయం తెలిసిందే. బాలకృష్ణ.. పదవిని అడ్డం పెట్టుకొని కోట్ల రూపాయలు సంపాదించినట్లుగా ఏసీబీ అధికారులు గుర్తించారు. ప్రస్తుతం సోదాలు కొనసాగుతున్నాయి. దాడులకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## అయోధ్య విజయంతో మోడీకి కేబినేట్ అభినందన

జన్మజన్మలకు ఒక్కసారి మాత్రమే వచ్చే అవకాశం

ఏకవాక్య తీర్మానంతో మంత్రివర్గం తీర్మానం

అయోధ్యలో రద్దీ తగ్గే వరకు వెళ్లొద్దని మంత్రులకు మోడీ హితవు



**న్యూఢిల్లీ, జనవరి 24 (సమ సమాజం):** అయోధ్యలో రామమందిర ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని అభినందిస్తూ కేంద్ర క్యాబినెట్ బుధవారంనాడు ఏకగ్రీవంగా ఒక తీర్మానాన్ని ఆమోదించింది. మోదీని ప్రశంసలతో ముంచెత్తింది. రామమందిర నిర్మాణం జన్మకొకసారి వచ్చే అవకాశం కాదని, జన్మజన్మలకు ఒకసారి వచ్చే అవకాశం అని పేర్కొంది. శతాబ్దాలుగా అయోధ్యలో రామాలయ నిర్మాణం జరగాలన్న ప్రజల ఆకాంక్షలను మోదీ నెరవేర్చారని ఆ తీర్మానం కొనియాడింది. క్యాబినెట్ సమావేశంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తన మంత్రివర్గ సహచరుల తరపున మోదీని అభినందిస్తూ తీర్మానాన్ని చదవి వినిపించారు. బుధవారంనాడు జరిగిన

3లో

## ఇండియా కూటమిలో లుకలుకలు



వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఒంటరి పోటీ

బెంగాల్ సిఎం మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు

**కోల్‌కతా, జనవరి 24 (సమ సమాజం):** పశ్చిమ బంగా ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలసి పోటీచేసే ప్రసక్తి లేదన్నారు. బెంగాల్లో బిజెపిని ఓడించాలంటే తాను ఒంటరి పోరాటం చేయడమే మంచిదని నిర్ణయించానని అన్నారు. అందుకే ఈ సారి జరగబోయే లోక్‌సభ ఎన్నికలకు ఒంటరిగానే వెళ్తామని వెల్లడించారు. రాష్ట్రంలోని 42 సీట్లకు సంబంధించి కాంగ్రెస్‌తో ఎలాంటి

3లో

## గణతంత్ర వేడుకలకు ఇద్దరు తెలంగాణ మహిళలు

ఎంపిక చేసిన పంపిన ప్రభుత్వం



**హైదరాబాద్, జనవరి 24 (సమ సమాజం):** 75వ గణతంత్ర దినోత్సవం కోసం యావత్ భారత్ సిద్ధమైంది. ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు ఈ సారి 1500 మంది రైతులు వేడుకలకు హాజరవుతారు. ముఖ్య అతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ వస్తున్నారు. ఎప్పటిలాగే శకటాల ప్రదర్శన, వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు వస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరు మహిళలు రిపబ్లిక్ డే వేడుకలకు హాజరు అవుతారు.

3లో

# ప్రత్యేకహోదాతోనే ఎపికి మనుగడ

## అది దక్కకుండా ఇద్దరూ పోటీ పడ్డారు

**బిజెపికి ఊడిగం చేస్తున్న నేతలతో ఎపికి నష్టం**

**చంద్రబాబు, జగన్ రాజకీయాలతో ప్రత్యేకహోదా మాయం**

**కాంగ్రెస్ కార్యకర్తలు ఇదే విషయం ప్రచారం చేయాలి**

**కాంగ్రెస్ శ్రేణులకు పిసిసి చీఫ్ షర్మిల పిలుపు**



విశాఖపట్టణం, జనవరి 24 (సమ సమాజం): ¬ ప్రత్యేక హోదా సాధిస్తేనే ఎపికి మనుగడ ఉంటుందని ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. ఇది కాంగ్రెస్ వల్ల మాత్రమే సాధ్యం కాగలదని అన్నారు. ఈ మేరకు గతంలో పదేళ్లపాటు పాలన చేసిన చంద్రబాబు, వైఎస్జగన్ పాలకుల తీరుపై షర్మిల స్వరం పెంచారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలుగా బాధ్యతలు స్వీకరించిన షర్మిల జిల్లాల్లో పర్యటిస్తున్నారు. బుధవారం విశాఖ జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె దస్పల్ల హోటల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. షర్మిల సమక్షంలో ఈ సందర్భంగా పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం మీడియాతో మాట్లాడిన షర్మిల తన అన్న సీఎం జగన్మోహన్ రెడ్డిపై సెటైర్లు వేశారు. మూడు రోజుల కిందట సీఎం జగన్ పై విమర్శలు చేస్తూ జగన్ రెడ్డి అని సంబోధించిన షర్మిలను.. ఆమె బంధువు వైవీ సుబ్బారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. విశాఖలో మాట్లాడిన షర్మిల.. జగనన్న గారు అని సంబోధిస్తూ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ ఇద్దరి కారణంగానే ప్రత్యేక హోదా దక్కలేదన్నారు. వీరు బిజెపికి లొంగిపోయి ఊడిగం చేస్తున్నారని మండిపడ్డారు. అధికార వైఎస్ఆర్ సీపీతోపాటు తెలుగుదేశం పార్టీ, భారతీయ జనతా పార్టీపై విమర్శలు గుప్పించారు. ఏపీలో కుమ్మక్కు రాజకీయాలు జరుగుతున్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో వైసీపీ, టీడీపీ కుమ్మక్కయ్యాయని మండిపడ్డారు. టీడీపీ అధినేత చంద్రబాబు వి కనిపించే పొత్తులు అని, వైసీపీ అధినేత సీఎం జగన్వి కనిపించని పొత్తులు అని విరుచుకు పడ్డారు. విశాఖపట్టణం జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో వైఎస్ షర్మిల పాల్గొన్నారు. ఏపీ సీఎం జగన్పై షర్మిల మరోసారి విరుచుకుపడ్డారు. 2019 ఎన్నికల్లో తమ పార్టీ ఎంపీలను గెలిపిస్తే ప్రత్యేక హోదా తీసుకొస్తానని చెప్పారని షర్మిల గుర్తుచేశారు. దాంతో ప్రజలు 22 మంది ఎంపీలను గెలిపించారని వివరించారు. ప్రత్యేక హోదా ఏదీ అని అడిగారు. లోక్ సభ ఎన్నికల్లో వైసీపీ ఎంపీలు గెలిచిన వెంటనే సీఎం జగన్ ఆ విషయం మరచి పోయారని మండిపడ్డారు. రాష్ట్రానికి హోదా కోసం ఒక్కరోజు కూడా ఉద్యమించ లేదని స్పష్టంచేశారు. ఉత్తరాంధ్రను వైసీపీ, తెలుగుదేశం పార్టీ రెండు మోసం చేశాయని వివరించారు. ఉత్తరాంధ్రలో ఉన్న కంపెనీలను ప్రైవేట్కి అప్పగిస్తున్నారని వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. గంగవరం పోర్టును అదానీకి తక్కువ ధరకు విక్రయించారని మండిపడ్డారు. విశాఖ స్టీల్ ఇందిరమ్మ హయాంలో ఏర్పడిందని గుర్తుచేశారు. వైఎస్సార్ హయాంలో 7 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరిగిందని పేర్కొన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించడం కుట్రలో భాగం అని షర్మిల ధ్వజమెత్తారు. నష్టాలు అని చెప్పి 30 వేల మంది కార్మికులను రోడ్డున పడేశారని మండిపడ్డారు. విశాఖలో మెట్రో రైల్ ప్రాజెక్టు పత్తా లేకుండా పోయిందని షర్మిల విమర్శించారు. బీజేపీ తొత్తులుగా వైసీపీ, టీడీపీ ఉన్నాయని షర్మిల విమర్శించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఇలా ఎప్పుడూ జరగలేదన్నారు. అసలు సిఎంను కలిసే అవకాశం మంత్రులు, ఎంపిలకే లేదన్నారు. ఇంతకన్నా దారుణం ఉంటుందా అన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందంటూ, దీనికి కారణం జగనన్న గారు కాదా అని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉండగా ప్రత్యేక హోదా కోసం జగనన్న గారు ఎన్నో మాటలు చెప్పారని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ప్రత్యేక హోదా కోసం మూకమ్మడిగా రాజీనామాలు చేద్దామని జగనన్న గారు చెప్పారని, 25 ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకువస్తామని చెప్పిన జగనన్న గారు ఎందుకు ఆ మాట నిలబెట్టుకోలేకపోయారని షర్మిల ప్రశ్నించారు. ఎన్నికల్లో స్పెషల్ స్టేటస్ నినాదంగా ఎత్తుకొని జగనన్న గారు పోటీ చేశారని షర్మిల పేర్కొన్నారు. జగనన్న గారు చెప్పిన ఈ మాటలన్నీ అవాస్తవమా..? అని ఆమె ప్రశ్నించారు. ఒక్కసారి కూడా బిజెపిని స్పెషల్ స్టేటస్ కోసం జగనన్న గారు ప్రశ్నించలేదని షర్మిల ఆరోపించారు. రాష్ట్రానికి స్పెషల్ స్టేటస్, స్పెషల్ ప్యాకేజీ కూడా లేకుండా పోయిందని షర్మిల విమర్శించారు. అధికార, ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆంధ్ర రాష్ట్రంలో కుమ్మక్కు రాజకీయాలు నడుస్తున్నాయని ఆరోపించారు. బీజేపీతో టీడీపీ, వైసీపీ కుమ్మక్కయ్యాయన్నారు. బీజేపీతో చంద్రబాబువి బయటకు కనిపించే పొత్తులని, వైసీపీవి కనిపించని పొత్తులన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని అధికార ప్రతిపక్షాలు రెండు మోసం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలోని కంపెనీలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పనంగా కట్టబెడుతున్నారన్నారు. గంగవరం పోర్టును 600 కోట్లకు అదానీకి అమ్మేశారన్నారు. 30 ఏళ్ల లీజు తర్వాత గంగవరం పోర్ట్ ప్రభుత్వ పరం కావాల్సి ఉందని, కానీ ప్రభుత్వం ఆదానికి అమ్ముతోందని ఆరోపించారు. నిబంధనలను తుంగలో తొక్కి ప్రభుత్వ వాటా 10 శాతం తక్కువకు అమ్మేశారని విమర్శించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయడం ఒక కుట్ర అని షర్మిల ఆరోపించారు. ఇందిరమ్మ హయాంలో ఏర్పడిన విశాఖ స్టీల్ ను అమ్మే ప్రయత్నం చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దీన్ని కాపాడుతుందని స్పష్టం చేశారు. వైఎస్సార్ హయాంలో మూడు మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన స్టీల్ ప్లాంట్ ను ఏడు మిలియన్ టన్నుల ఉత్పత్తి కి పెంచారని వెల్లడించారు. నష్టాల సాకు చూపి ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్నారని, ఇది తగదన్నారు. విశాఖకి రైల్వే జోన్ , ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వలేదని, బిజెపి ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు.రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని, అధికారంలోకి వచ్చిన వెంటనే విభజన హామీలను అమలు చేయడంతో పాటు స్టీల్ ఎ÷-లాంట్ ను పరిరక్షిస్తామని స్పష్టం చేశారు. బీజేపీకి తొత్తులుగా ఉన్న వైసీపీ, టీడీపీ లను ఓడగొట్టాలని, అంతవరకు క్యాడర్ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. షర్మిల పర్యటన సందర్భంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా కార్యకర్తల కోలాహలం కనిపించింది. సుమారు 10 ఏళ్ల తర్వాత భారీ సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పార్టీ సమావేశానికి హాజరయ్యారు. వివిధ పార్టీలకు చెందిన సుమారు వందమంది నాయకులు కార్యకర్తలు షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిలో వైసీపీకి చెందిన కొయ్యి ప్రసాద్ రెడ్డి తో పాటు పలువురు నాయకులు ఉన్నారు. షర్మిల ప్రసంగిస్తున్న సేపు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఈలలు వేస్తూ సందడి చేశారు.

# ఇండియా కూటమిలో లుకలుకలు



(మొదటి పేజీ తరువాయి) సంప్రదింపులు జరగలేదన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాతే పొత్తుపై తదుపరి నిర్ణయం తీసుకుంటామని వివరించారు. కాంగ్రెస్ తో కలిసి కాకుండా ఈ సారికి ఒంటరిగానే ఎన్నికల బరిలో పోరాడతామని తెలిపారు. రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర గురించి తనకు సమాచారం లేదని మమతా బెనర్జీ స్పష్టం చేశారు. కాగా.. మమతా బెనర్జీపై కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఆమె అవకాశవాది అని విమర్శించారు. దీదీ సహకారం లేకుండానే రానున్న లోక్సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ చేయాలని ఆయన కోరారు. అధిర్ వ్యాఖ్యలతో ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల్లో గందరగోళం నెలకొంది. బెంగాల్లో కాంగ్రెస్కు మమతా బెనర్జీ కేవలం రెండు సీట్లు మాత్రమే ఆఫర్ చేశారని, సీట్ల కోసం కాంగ్రెస్ వెంపర్లాడదని ఆయన

# మేం పార్టీ మారడం లేదు





(మొదటి పేజీ తరువాయి) మాట్లాడిన్మమ్మెల్యేలు స్పష్టత ఇచ్చారు. తాము పార్టీ మారే ప్రసక్తే లేదని.. కేసీఆర్ వెంటే ఉంటామని చెప్పారు. ప్రొటోకాల్ కోసం, తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల కోసమే సీఎం రేవంత్ని కలిసినట్టు వివరణ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం ఉమ్మడిగా మీడియా సమావేశంలో వెల్లడించారు. తమ నాయకుడు కేసీఆర్ నాయకత్వంతో పూర్తి విశ్వాసంతో పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తెలిపారు. మెదక్ జిల్లా బీఆర్ఎస్ గడ్డ అని, ఆ నమ్మకంతోనే 10 స్థానాల్లో 7 చోట్ల బీఆర్ఎస్ను గెలిపించారని ఆమె అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్లో బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తామని ఆమె అన్నారు. రాజకీయ దురుద్దేశంతో కొంతమంది ప్రచారం చేస్తున్నారని ఆమె ఖండించారు. మా పార్టీ నాయకత్వానికి మా మీద ఎలాంటి అపనమ్మకం లేదు. కానీ గందరగోళం సృష్టించాలనే ప్రయత్నంతో ఈ ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ అధిష్ఠానానికి నలుగురు ఎమ్మెల్యేలు వివరణ ఇవ్వబోతున్నారని వార్తలు వస్తున్నాయి. అలాంటిదేమీ లేదు. ఎవరికీ వివరణ ఇవ్వడంలేదు. మాపై పార్టీకి నమ్మకం. మాకు కూడా పార్టీపై నమ్మకం, గౌరవం ఉన్నాయని సునీతా లక్ష్మా రెడ్డి తెలిపారు. ఈ ప్రచారాన్ని ఖండిస్తున్నాను. ఎవరికీ వివరణ ఇవ్వడానికి రాలేదు. ప్రజల్లో ఒక గందరగోళాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. అందుకే మా నాయకులు, కార్యకర్తలు ఎవరూ ఎలాంటి గందరగోళానికి గురికావొద్దు. దురుద్దేశంతో లేనిపోని మాటలు చెప్తున్నారు. అప్రతిష్ఠపాలు చేసే విధంగా వ్యవహరిస్తున్నారు. సీఎం గారితో నిన్న ప్రోటోకాల్, మాకు ఎస్కార్ట్, పైలెటింగ్ ఇవ్వడంలేదని చెప్పాం. అదేవిధంగా కొన్ని అభివృద్ధి కార్యక్రమాల గురించి సీఎంతో మాట్లాడాం అని సునీతా లక్ష్మారెడ్డి వివరించారు. 30 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమతో టచ్లో ఉన్నారని, తామే చేర్చుకోవడానికి సిద్ధంగా లేమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించిన నేపథ్యంలో జరిగిన ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. వారు పార్టీ మారుతున్నారంటూ పార్టీ వర్గాల్లో ప్రచారం జోరుగా సాగిన విషయం తెలిసిందే.

# గణతంత్ర వేడుకలకు ఇద్దరు తెలంగాణ మహిళలు



(మొదటి పేజీ తరువాయి) వారిలో ఒకరు స్వీపర్ నారాయణమ్మ కాగా మరొకరు మొబైల్ షీ టాయిలెట్ నిర్వాహకురాలు నాగలక్ష్మీ. వీరిద్దరిని రిపబ్లిక్ డే వేడుకల కోసం జీహెచ్ఎంసీ అధికారులు తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులుగా ఢిల్లీ పంపించారు. నారాయణమ్మ స్వస్థలం రంగారెడ్డి జిల్లా యాచారం. గత 22 ఏళ్లుగా గ్రేటర్లో స్వీపర్గా పనిచేస్తున్నారు. బంజారాహిల్స్ కాలనీల్లో నిత్యం రోడ్లను ఊడుస్తుంటారు. సమయం దొరికితే చాలు భజన, భక్తి కార్యక్రమాలకు హాజరవుతారు. జానపద గీతం, రామాయణ, భారతాలను పాటలుగా పాడతారు. వేమన పద్యాల నుంచి సంస్కృత పద్యాలు చెబుతారు. నారాయణమ్మ గాత్రం విని ఎవరైనా ఫిదా కావాల్సిందే. అలాంటి నారాయణమ్మ ఈ సారి రిపబ్లిక్ డే వేడుకల్లో తెలంగాణ ప్రతినిధిగా హాజరవుతారు. సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన నాగలక్ష్మీ. ఈమె రెండు డిగ్రీలు చేశారు. గత ఐదేళ్ల నుంచి కోదాడలో మొబైల్ టాయిలెట్ నిర్వాహకురాలిగా సేవలు అందిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 8.30 గంటలకు ఆటోకు బిగించిన టాయిలెట్ను ఊరంతా తిప్పుతారు. గుడి వద్ద, బస్టాండ్ దగ్గర, మార్కెట్ వద్ద మొబైల్ టాయిలెట్ ఉంచుతారు. మొబైల్ టాయిలెట్ వాడుకున్న వారి నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోరు. ఉచితంగా సేవ అందిస్తున్నారు. రిపబ్లిక్ డే వేడుకలకు ఐదుగురు మహిళా సర్పంచ్లకు కూడా ఆహ్వానం వచ్చింది. స్వచ్ఛ సర్వేక్షణ్లో భాగంగా గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దిన ఐదుగురికి పిలుపు వచ్చింది. ఖమ్మం జిల్లాకు చెందిన పాపిశెట్టి శైలజ, ములుగుకు చెందిన ఎం అనితారాణి, నాగర్ కర్నూలుకు చెందిన పి సురేఖ, సంగారెడ్డికి చెందిన బక్క రమాదేవి, వికారాబాద్కు చెందిన కాంతి లక్ష్మి ఉన్నారు. వీరంతా తమ భర్తలతో కలిసి వేడుకలకు రావాలని ఆహ్వానించారు.

# అయోధ్య విజయంతో మోడీకి కేబినేట్ అభినందన



(మొదటి పేజీ తరువాయి) మంత్రివర్గ సమావేశం ఒక చారిత్రక సమావేశమని ఆయన పేర్కొన్నారు. దేశంలో క్యాబినెట్ సిస్టం మొదలైనప్పటి నుంచి ఎన్నో చారిత్రక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని, అయితే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో అయోధ్యలో విజయవంతంగా రామాలయ నిర్మాణం జరగడం, ప్రాణప్రతిష్ఠ నిర్వహించడం చరిత్రలోనే ప్రముఖంగా నిలిచిపోతుందని అన్నారు. 1947లో దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పటికీ, దేశ ఆత్మ 'ప్రాణప్రతిష్ఠ' 2024 జనవరి 22న జరిగిందని రాజ్నాథ్ అభివర్ణించారు. మోదీకి అభినందనలు తెలుపుతూ క్యాబినెట్ ఏకగ్రీవ తీర్మానం చేసినట్టు సమావేశానంతరం కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మీడియాకు వెల్లడించారు. ఇదిలావుంటే అయోధ్యలో బాలక్ రామ్ దర్శనం కోసం లక్షలాది భక్తులు తరలి వస్తుండటంతో ఏర్పడిన రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన మంత్రివర్గ సహచరులకు తగిన సూచనలు ఇచ్చారు. రామాలయం పర్యటనలను ప్రస్తుతానికి వాయిదా వేసుకోవాలని కోరారు. మోదీ అధ్యక్షతన బుధవారంనాడు జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆయన ఈ మేరకు సలహా ఇచ్చారు. అయోధ్య రామాలయం వద్ద రద్దీ ఎక్కువగా ఉండటంతో వీవీఐపీలు, వీఐపీల పర్యటన వల్ల భక్తులకు ఇబ్బందులు కలిగే అవకాశాలున్నాయని మోదీ అభిప్రాయపడినట్టు తెలుస్తోంది. మంత్రులు తమ పర్యటనలను మార్చికి వాయిదా వేసుకోవాలని, అప్పుడైతే సజావుగా రామయ్యను దర్శించుకోవచ్చని, చక్కటి దర్శనానుభూతిని పొందవచ్చని ప్రధాని సూచించారు. ÷ూగా, అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠ అనంతరం లక్షల సంఖ్యలో భక్తులు క్యూలు కడుతున్నారు. వీరి రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శనం వేళలు పెంచేందుకు అధికారులు నిర్ణయించారు. ఇంతవరకూ రాత్రి 7 గంటల వరకూ ఉన్న దర్శన వేళలను 10 గంటల వరకూ పొడిగించారు. 29వ తేదీ వరకూ ఆన్లైన్ బుకింగ్లను నిలిపేశారు.

# ప్రియుడి మోజులో కొడుకును చంపిన తల్లి

**ఇద్దరికి జీవిత ఖైదు విధించిన నల్లగొండ కోర్టు**



నల్లగొండ, జనవరి 24 (సమ సమాజం): ¬ ప్రియుడి మోజులో పడి కన్న కొడుకును చంపిన కేసులో.. ఇద్దరికి నల్గొండ జిల్లా కోర్టు జీవితఖైదును శిక్షగా విధించింది. నల్గొండ మండలం బుద్దారంలో ప్లలెటి విజయ, తోకల వెంకట్ రెడ్డి మధ్య అక్రమ సంబంధం ఏర్పడింది. తమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని.. కొడుకుని తల్లి విజయ చంపింది. కానీ కేసును తప్పుదోవ పట్టించడానికి.. తన కొడుకుకి ఫిట్స్ వచ్చి చనిపోయాడని నాటకం ఆడింది. అనుమానం వచ్చిన నల్గొండ రూరల్ ఎస్సై ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, సీఐ బాషా ఆధ్వర్యంలో ఎంక్వయిరీ చేపట్టారు. 2020 ఫిబ్రవరి 21 శివరాత్రి రోజు కేసు నమోదు చేశారు. అయితే ఈ విచారణలో బాలుడి గొంతుని తల్లి నులిమి చంపినట్లుగా వాస్తవాలు బట్టబయలైంది. ఈ కేసులో కన్నతల్లి విజయ, ప్రియుడు వెంకట్ రెడ్డిని నిందితులుగా తేల్చారు పోలీసులు. నల్గొండ డిస్టిక్ట్ సెషన్ జడ్జి జీవిత ఖైదీగా ఇద్దరికి శిక్ష విధించారు.

# బిఆర్ఎస్లో ఆధిపత్య పోరు



(మొదటి పేజీ తరువాయి) పార్టీ మారడం లేదని స్పష్టం చేశారు. నియోజక అభివృద్ధి కోసం సీఎంను, మంత్రులను కలవటం తమ బాధ్యతని తెలిపారు. తాము పార్టీ మారుతున్నట్లు తప్పుడు ప్రచారం జరుగుతోందని అందుకే వివరణ ఇస్తున్నామని చెప్పారు. కేసీఆర్ నాయకత్వంపై తమకు పూర్తి నమ్మకం ఉందని.. లోక్ సభ ఎన్నికల్లో భారీ మెజార్టీతో మెదక్ ఎంపీ సీటు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కలవడం ఇప్పుడు రాష్ట్రంలో హాట్టాపిక్గా మారింది. ఆ నలుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్లో చేరబోతున్నారన్న వార్త సంచలనాన్ని రేపుతోంది. ఈ క్రమంలో ఈ వ్యవహారంపై దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు స్పందిస్తూ.. బీఆర్ఎస్పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఖర్మ సిద్ధాంతం ఇప్పుడు బీఆర్ఎస్కు అనుభవంలోకి వస్తోందని.. ఎవరు చేసుకున్నది వారికే తిరిగి వస్తుందన దానికి ఆ నలుగురు ఎమ్మెల్యేలు సీఎంను కలవడమే నిదర్శనమన్నారు. భూమి గుండ్రంగా ఉంటదని.. మనమేం చేస్తే అదే తిరిగి వస్తుందంటే ఇదే అని చెప్పుకొచ్చారు. మెజారిటీ ఉన్నా కూడా అప్పుడు బీఆర్ఎస్ చేసిన పని ఇప్పుడు కాంగ్రెస్ చేస్తోందన్నారు. పార్టీలను చీల్చడానికి, ఎమ్మెల్యేలను చేర్చుకోవడానికి బీఆర్ఎస్కు ఏడేండ్లు పడితే... కాంగ్రెస్కు ఏడు నెలలు కూడా పట్టడం లేదన్నారు. హరిశ్రావు ప్రోద్బలం లేకుండా వీరు వెళ్తారా అని బీజేపీ నేత ప్రశ్నించారు. బీఆర్ఎస్లో బావ బామ్మర్దులకు పడటం లేదన్నారు. కవిత మెదక్ ఎంపీగా పోటీ చేస్తున్నట్లు వార్తలు రావడంతో జిల్లా నేతలు, ఎమ్మెల్యేలు అలెర్ట్ అవుతున్నారన్నారు. హరీష్రావు ప్రోద్బలం లేకుండా వారంతా సీఎంను కలిసే అవకాశం లేదన్నారు. ప్రజలు తిరస్కరించిన తరువాత కూడా బీఆర్ఎస్ నేతల్లో మార్పు రావడం లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల తరువాత బీఆర్ఎస్ పెద్ద జీరో అంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రోటోకాల్ అంటే ఏమిటో తమకు నిన్నటి వరకు గుర్తు లేదా అని నిలదీశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కనీసం అభివృద్ధికి నిధులు ఇవ్వలేదని మండిపడ్డారు. ఈ దుష్ట సంప్రదాయం తెచ్చింది బీఆర్ఎస్ అని విరుచుకుపడ్డారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్కు ఓటు వేస్తే అది మూసీ, బంగాళాఖాతంలో వేసినట్లే అని అన్నారు. 2009 లో కేసీఆర్ అధ్యక్ష పీఠం గుంజుకోవడానికి జరిగిన కొట్లాట మళ్ళీ ఇప్పుడు ఆ పార్టీలో జరుగుతోందన్నారు. బీఆర్ఎస్ అధ్యాయం మొన్నటి ఎన్నికలతో ముగిసిందన్నారు. అధికారం కోల్పోయినా ఇంకా తాము అధికార పార్టీ అన్నట్లుగా వారు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటనడం కేటీఆర్ అవివేకానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే అయితే ఇక ఎన్నికల అవసరం ఉంటుందా అని ప్రశ్నించారు. బీజేపీకి ఈసారి రాష్ట్రంలో 16 సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్కు 12 సీట్లు అనడం భ్రమ అని.. 90 సీట్లతో అధికారంలో ఉన్నప్పుడే ఆ పార్టీకి సింగిల్ డిజిట్ వచ్చిందన్నారు. ఇప్పుడు ఆ పార్టీని గల్లీలో కాంగ్రెస్ రానియదని.. ఢిల్లీలో బీజేపీ రానియదని రఘునందన్ రావు స్పష్టం చేశారు.

# ప్రజలను అవమానించేలా పోస్టులు సరికాదు



(మొదటి పేజీ తరువాయి) ఉందని దేశం మొత్తానికి చాటిచెప్పిన సందర్భం సింహగర్జన' అన్నారు. 2001లో ఉద్యమానికి ఊపిరిపోసినా.. 2006లో మళ్లీ పునర్జన్మనిచ్చినా ఇదే కరీంనగర్ గడ్డపై ఆ నాడు 2లక్షల ఓట్ల మెజారిటీతో కేసీఆర్ను ఉప ఎన్నికల్లో గెలిపించింది. మళ్లీ దేశానికి బలంగా తెలంగాణ కావాలని చెప్పింది కరీంనగర్ గడ్డ గొప్పతనమే. 2009లో ఆశలు లేవు.. అయిపోయింది టీఆర్ఎస్ పరిస్థితి.. 45 సీట్లలో పోటీ చేస్తే పది సీట్లే గెలిచింది.. అయిపోయింది కేసీఆర్, టీఆర్ఎస్ పని.. తెలంగాణ రాష్ట్రం ఇక రాదు అనే పరిస్థితుల్లో మరోసారి అక్కున చేర్చుకొని గుండెల్లో పెట్టుకొని 2009 నవంబర్ 29న అల్గునూర్లో అగ్గి అంటించింది ఇదే కరీంనగర్ గడ్డ అనేమాట మీ అందరికీ గుర్తు చేస్తున్నాను. కరీంనగర్ నిరాహార దీక్షలో అల్గునూర్లో ఆయన అరెస్టు కాగానే తెలంగాణ అంతా అగ్గి అంటుకున్న విషయం మీ అందరికీ తెలుసు. మొన్న జరిగిన ఎన్నిక డిసెంబర్ 3న వచ్చిన ఫలితం.. హతాశయులయ్యే పరిస్థితి కాదు. ఇంట్లో దుప్పటి కప్పుకొని పడుకునేంత బాధాకరమైన ఫలితం కాదు' అని కేటీఆర్ స్పష్టం చేశారు. సోషల్ మీడియా భావోద్వేగంతో ఉంటరు. ఉద్యమ పార్టీగా.. ఉద్యమంలో మొదటి నుంచి ఉన్న తమ్ముళ్లు.. తర్వాత వచ్చిన తమ్ముళ్లకు తెలంగాణతో, కేసీఆర్, పార్టీతో భావోద్వేగపూరిత అనుబంధం ఉంటుంది. కొందరిని చూసిన ప్రజలను మోసం చేసిన నాయకులను చూశాం కానీ.. నాయకులను మోసం చేసిన ప్రజలను చూడలేదు అని కొందరు పోస్టులు పెట్టారు. నేను మిమ్మల్ని చేతులెత్తి వేడుకుంటున్నా.. ఇలాంటి భావోద్వేగపూరిత మాటలు ప్రజలను కించపరిచేలా మాట్లాడడం సరికాదు. ఎందుకంటే అదే ప్రజలు మనకు అండగా నిలబడ్డరు. అదే ప్రజలు తెలంగాణ ఉద్యమంలో ఏం లేని నాడు.. 2001లో కేసీఆర్ బయలుదేరిన నాడు.. మజిల్ పవర్ లేదు.. మనీ పవర్ లేదు. మీడియా పవర్ లేదు. ప్రత్యర్థులకు కొదవ లేదు. ఏం లేనినాడు కూడా కేసీఆర్ను ఎత్తిన పెట్టుకున్నది.. గుండెల్లో పెట్టుకున్నది అదే ప్రజలు.. నడిపించింది అదే ప్రజలని మరిచిపోవద్దు. ఒక్కసారి 1.85శాతం తేడాతో మనపై చిన్నపాలి అలకచూపెడితే దానికి ప్రజలను నిందించడం సోషల్ మీడియాలో మంచిది కాదు. ఇలాంటి పనులు చేయొద్దు' అంటూ సూచించారు. తెలంగాణ ప్రజల మనసు మళ్లీ తిరిగి ఎట్ల గెలుచుకుందాం.. లోక్సభ ఎన్నికల్లో మళ్లీ ఎట్లా జెండా పాతుదాం.. మళ్లీ ఎట్ల గులాబీ జెండా ఎగురవేద్దామనే దిశగా ఆలోచిద్దాం పొరపాటున కూడా ప్రజలను నిందించే విధంగా, ప్రజల తీర్పును అవమానించేలా మాట్లాడొద్దు. గెలుపుతోని పొంగిపోవద్దు.. ఓడిపోతే కుంగిపోవద్దని మన నాయకుడు కేసీఆర్ చెబుతారు. ఉద్యమం ప్రారంభమైన కొత్తలో రసమయి బాలకిషన్, గోరెటి వెంకన్న, వరంగల్ శీనులాంటి వారితో కూర్చొని పాటలు రాసేది. కేసీఆర్ ఆ నాడే పిడికిలి బిగించి.. కవులు, కళాకారులతో పాటలు రాయించి.. స్వయంగా కూర్చొని ఈ పాటలకు మెరుగులుదిద్దిన పరిస్థితి' అని కేటీఆర్ గుర్తు చేశారు.

# చివరి శ్వాస వరకు కేసీఆర్ వెంటే నడుస్తాం...!




**అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డిని కలిస్తే తప్పేంట.**

**దుష్ప్రచారం చేస్తే కఠిన చర్యలు.. ఎమ్మెల్యే జి.ఎం.ఆర్**

పటాన్చెరు, జనవరి 24 (సమ సమాజం) కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు కేసీఆర్ వెంటే నడుస్తామని.. కెసిఆర్ ఆశీర్వాదంతో మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించామని.. నమ్ముకున్న ప్రజల కోసం నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎన్నిసార్లైనా కలుస్తామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాదులోని బిఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సహచర శాసనసభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు.. బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాదంతో..మినీ ఇండియా గా పేరుందిన పటాన్చెరు నియోజకవర్గ ప్రజల నమ్మకంతో మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించడం జరిగిందని తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఒకసారి అవకాశం కల్పిద్దామని అధికారం కట్టబెట్టారని.. ఈ నేపథ్యంలో నియోజకవర్గ అభివృద్ధి కోసం గత ప్రభుత్వంలో మంజూరైన జీవోల అమలు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవడం జరిగిందే తప్ప.. ఎటువంటి రాజకీయ ఉద్దేశాలు లేవని ఆయన విస్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ సమస్యల పరిష్కారం కోసం ఎన్నిసార్లైనా సీఎం రేవంత్ రెడ్డిని కలుస్తామని ఈ విషయంలో ఎటువంటి అనుమానాలకు తావు లేదని తెలిపారు. సమస్యలు పరిష్కారం కానీ పక్షంలో పోరాటాలకు సైతం సిద్ధమని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులను కలిశారని అదే విధంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం తాము ముఖ్యమంత్రి కలిశామని ఈ అంశంపై రాజకీయ దుష్ప్రచారం చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని తెలిపారు. రాజకీయ వైరుధ్యాలు ఉంటే రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వారిని కలవడం తప్పా అని ప్రశ్నించారు. కాకమ్మ కబుర్లు చెబుతూ అధికార కాంగ్రెస్ పార్టీ కాలం వెళ్లదీస్తే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ పార్లమెంటు నియోజకవర్గం నుండి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో తిరిగి కెసిఆర్ ని ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని తెలిపారు. సోషల్ మీడియాలో దుష్ప్రచారాలు మానుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# బెంగుళూరులో మాయం

**హైదరాబాద్‌లో ప్రత్యక్షం**

**బాలుడి ఆచూకీని కనిపెట్టిన సోషల్ మీడియా**

హైదరాబాద్,జనవరి24(సమ సమాజం): ఆదివారం బెంగళూరు నుండి తప్పిపోయిన 12 ఏళ్ల బాలుడు బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని నాంపల్లి మెట్రో స్టేషన్‌లో ప్రత్యక్షమయ్యాడు. పోలీసులు వెతికినా సాధ్యం కాని అతని ఆచూకీని సోషల్ మీడియా కనిపెట్టేసింది. ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే.. ఆ పిల్లాడు తన చేతిలో ఉన్న 100 రూపాయలతో బెంగళూరు నుంచి బయలుదేరి.. 570 కిలోమీటర్ల దూరంలో ఉన్న హైదరాబాద్‌కు చేరుకున్నాడు. మిస్ అయిన బెంగళూరు నుంచి అతన్ని ట్రాక్ చేసి, రీచ్ అయ్యేందుకు ప్రయత్నించిన ప్రతిసారి అక్కడి నుంచి జంప్ అవుతున్నాడు బాలుడు. చివరకు మూడు రోజుల తరువాత పిల్లాడి ఆచూకీ హైదరాబాద్‌లో లభించింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బెంగళూరులోని డీన్స్ అకాడమీకి చెందిన ప్రణవ్(12).. మూడు రోజుల క్రితం మిస్ అయ్యాడు. ఉదయం 11 గంటలకు వైట్‌ఫీల్డ్‌లోని కోచింగ్ సెంటర్ నుంచి బయలుదేరిన ప్రణవ్.. చీకటి పడినప్పటికీ ఇంటికి రాలేదు. దాంతో కంగారు పడిన ప్రణవ్ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రవణ్ కదలికలను గుర్తించేందుకు సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. ఉదయం 11 గంటలకు కోచింగ్ సెంటర్ నుంచి బయటకు వెళ్లిన ప్రణవ్.. మధ్యాహ్నం 3 గంటలకు యెమ్లూర్ సమీపంలోని పెట్రోల్ పంపు వద్ద కనిపించాడు. ఆ కాసేపటికే బెంగళూరులోని మేజిస్టిక్ బస్ టెర్మినస్‌లో సాయంత్రం బస్ దిగాడు. చివరగా ప్రణవ్ అక్కడే కనిపించాడు. అక్కడి నుంచి మైసూర్‌కు, ఆ తరువాత చెన్నైకి, చెన్నై నుంచి హైదారబాద్‌కు చేరుకున్నాడు. అయితే, ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే.. ప్రణవ్ వద్ద కేవలం రూ. 100 ఉన్నాయట. డబ్బుల కోసం తన వద్దనున్న పార్కర్ పెన్నులను విక్రయించాడట. ఒక్కో పెన్నును రూ. 100 చొప్పున విక్రయించి డబ్బులు సమకూర్చుకున్నాడు. ప్రణవ్ పెన్నులు విక్రయిస్తున్నట్లుగా సీసీటీవీ ఫుటేజీలో స్పష్టంగా కనిపించింది. అయితే, ప్రణవ్ ఆచూకీ తెలియకపోవడంతో.. పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేశారు. మరోవైపు తీవ్ర ఆందోళనలో ఉన్న అతని తల్లిదండ్రులు.. ప్రణవ్‌ను కనిపెట్టేందుకు సోషల్ మీడియాను ఆశ్రయించారు. ప్రణవ్ ఫోటోను, అతను రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్తున్న ఫుటేజీని సోషల్ మీడియాలో పోస్ట్ చేసి.. అతని ఆచూకీ తెలిస్తే చెప్పాల్సిందిగా అభ్యర్థించారు. ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అబ్బాయి ఆచూకీని కనిపెట్టేందుకు చాలా మంది దీనిని రీపోస్ట్, షేర్ చేశారు. మొత్తానికి మూడు రోజులు గడిచిన తరువాత.. బుధవారం హైదరాబాద్‌లోని నాంపల్లి మెట్రో స్టేషన్‌లో ప్రణవ్‌ను ఓ వ్యక్తి గుర్తించాడు. సోషల్ మీడియాలో ప్రణవ్ మిస్సింగ్ పోస్ట్ చేసిన వ్యక్తి.. ప్రణవ్ తన ఎదుటే ఉండటాన్ని గమనించాడు. వెంటనే అతన్ని పట్టుకుని.. అతని తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. ఆపై విషయాన్ని పోలీసులకు కూడా తెలియజేశాడు. ప్రణవ్ తల్లిదండ్రులు ప్రస్తుతం బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు పయనమయ్యారు. ప్రణవ్ ఎందుకిలా చేశాడో తమకు తెలియదంటున్నారు అతని తల్లిదండ్రులు. మొత్తానికి మిస్ అయిన బాలుడిని సోషల్ మీడియా పట్టించేసింది. దాంతో అప్పటి వరకు కన్నీళ్లతో నిండి ఉన్న ఆ తల్లి కళ్లు.. ఇప్పుడు ఆనందంతో కుదిటపడ్డాయి.

# మెహిదీపట్టణం స్కై వాక్‌కు రోణ భూములు

**కేంద్ర రక్షణశాఖ ఆమోదం**

హైదరాబాద్,జనవరి24(సమ సమాజం): తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఒక గుడ్ న్యూస్ చెప్పింది. మెహదీపట్నంలో స్కై వాక్ నిర్మాణానికి గాను భూకేటాయింపునకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మెహదీపట్నంలో రక్షణ శాఖకు చెందిన 3,380 చదరపు గజాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర అప్పగించనుంది. అయితే.. ఇక్కడే కేంద్రం ఒక కండీషన్ పెట్టింది. ఆ భూములు ఇచ్చినందుకు గాను రక్షణ శాఖకు రూ.15.15 కోట్ల మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి షరతు విధించింది. అలాగే.. కొంత స్థలానికి పదేళ్ల లైసెన్స్ రుసుం చెల్లించాలని పేర్కొంది. నాలుగు వారాల్లోనే ఈ భూముల్ని అప్పగించేలా కేంద్ర రక్షణ శాఖ అంగీకారం తెలిపింది. ఇదిలావుండగా.. మెహదీపట్నంలో రోడ్డు దాటేందుకు పాదచారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుండటంతో, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ ప్రాంతంలో స్కైవాక్ నిర్మించాలని నిర్ణయించింది. ఐదేళ్ల క్రితం హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ఈ స్కైవాక్‌ని ప్రతిపాదించగా.. మూడేళ్ల క్రితం రూ.34.28 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు పనులను ప్రారంభించారు. అయితే.. తమ భూముల్లో పనులు చేస్తున్నారని రక్షణ శాఖ అడ్డుకోవడంతో, ఈ స్కైవాక్ పనులు ఆగిపోయాయి. ఈ పనుల్ని పునఃప్రారంభించేందుకు గత ప్రభుత్వం ప్రయత్నించింది కానీ, ఎందుకో ముందుకు సాగలేదు. ఇప్పుడు రక్షణ శాఖ భూములు ఇచ్చేందుకు అంగీకారం తెలపడంతో, ఈ పనులు తిరిగి ప్రారంభం కానున్నాయి.

# ఉప్పల్ వేదికగా భారత్–ఇంగ్లండ్ మధ్య తొలి టెస్టు

**కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు: పోలీస్ కమిషనర్**




హైదరాబాద్,జనవరి24(సమ సమాజం): గురువారం నుంచి ఉప్పల్ వేదికగా భారత్–ఇంగ్లండ్ మధ్య తొలి టెస్టు ప్రారంభంకానున్న విషయం తెలిసిందే. ఈ పోరుకు రాజీవ్‌గాంధీ స్టేడియం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. కాకి రెట్టలు, విరిగిపోయిన పాత కుర్చీలను మార్చడంతో పాటు కొత్తగా పై కప్పులను నిర్మించారు. చూడగానే ఇది మన ఉప్పల్ స్టేడియమేనా అని ఆశ్చర్యపోయేలా కలర్‌ఫుల్‌గా మార్చేశారు. ఈ క్రమంలో భద్రతా ఏర్పాట్ల గురించి రాచకొండ సీపీ సుధీర్ బాబు మీడియా సమావేశం నిర్వహించారు. గురువారం ఉదయం 6.30 నుంచి ప్రేక్షకులను స్టేడియంలోకి అనుమతిస్తామని తెలిపిన రాచకొండ సీపీ.. స్టేడియం చుట్టూ ఏర్పాటుచేసిన 360 సీసీ కెమెరాలతో భద్రతను పరీక్షిస్తున్నట్లు వెల్లడించారు. పోలీస్ అధికారులపై కూడా నిఘా ఉంచుతామని తెలిపారు. ప్రేక్షకులు స్టేడియం లోపల బయట మంచిగా నడుచుకోవాలని కోరారు. 'ఉదయం 6.30 నుండి ప్రేక్షకులను స్టేడియంలోకి అనుమతిస్తాం. స్టేడియం చుట్టూ 360 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. పోలీస్ అధికారులపై కూడా నిఘా ఉంచుతాం. పీక్ అవర్స్‌లో ప్రేక్షకులు ఎక్కువ సంఖ్యలో వస్తారు కాబట్టి.. స్టేడియం చుట్టూ ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి. 1500 మంది పోలీసులతో మ్యాచ్‌కి బందోబస్తు ఏర్పాటు చేశాం. ఆక్టోపస్ బలగాలు, 100 షీ టీమ్స్ విధుల్లో ఉంటాయి. ఎట్టి పరిస్థితులలోనూ స్టేడియంలోకి కెమెరాలు, ల్యాప్ టాప్స్, బ్యాగ్స్, సిగరెట్స్, హెల్మెట్స్, వాటర్ బాటిల్స్, పెన్స్, పవర్ బ్యాంక్స్, బయటి ఫుడ్ అనుమతించమని అననారు,. 'స్టేడియానికి వచ్చే ప్రేక్షకులు మంచిగా నడుచుకోవాలి. క్రమశిక్షణతో మెలగాలి. ఒకసారి లోపలికి వెళ్లాక బయటకి వెళ్లి తిరిగి స్టేడియం లోపలికి వస్తామంటే అనుమతించం. ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. మ్యాచ్‌కి వచ్చే వారికి సరైన పార్కింగ్ సదుపాయాలు కూడా కల్పిస్తున్నాం. బ్లాక్ టికెట్స్ అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం..' అని రాచకొండ సీపీ సుధీర్ బాబు చెప్పారు. 2018 తర్వాత జరుగుతున్న టెస్టు మ్యాచ్ కావడంతో భారీ సంఖ్యలో ప్రేక్షకులు హాజరవ్వొచ్చని అంచనా. అందునా పాఠశాల విద్యార్థులకు ప్రవేశం ఉచితం కావడంతో ఎటు చూసిన వారే కనిపించొచ్చన్నారు.

# త్వరగా రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణ

**చేపట్టాలంటూ సిఎంకు కిషన్ రెడ్డి లేఖ**



హైదరాబాద్,జనవరి24(సమ సమాజం): భారత్ మాల, రీజినల్ రింగ్ రోడ్డు భూ సేకరణ ప్రక్రియ చేపట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి కోరారు. ఈ మేరకు సిఎంకు లేఖ రాశారు. భారత్ మాల, రీజినల్ రింగ్ రోడ్డు భూ సేకరణ ప్రక్రియ చేపట్టాలని ఆ లేఖలో కోరారు. భారతమాల పథకంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో నిర్మించే జాతీయ రహదారులకు భూ సేకరణ చేయాల్సి ఉంది. రీజనల్ రింగ్ రోడ్డు భూ సేకరణ కోసం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాకు (ఎన్‌హెచ్‌ఏఐ)కి 50 శాతం నిధులు జమ చేయాలని కిషన్ రెడ్డి కోరారు. ఇవే అంశాలకు సంబంధించి గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి లేఖ రాశామని వివరించారు. అప్పటి ప్రభుత్వం స్పందించలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆ ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి సూచించారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుకు వెలుపల రెండు భాగాలుగా 347.84 కిలోమీటర్ల మేర రహదారిని నిర్మించాల్సి ఉంది. ఫస్ట్ ఫేజ్ కింద 158.64 కిలోమీటర్ల ఉత్తర భాగానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారి హోదా ప్రకటించింది. 70 శాతానికి పైగా భూ సేకరణ వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరించాలని గతంలో ప్రభుత్వాలు ఒప్పందం చేసుకున్నాయి. రహదారి నిర్మాణ బాధ్యతను కేంద్ర ప్రభుత్వం తీసుకుంది. యుటిలిటీస్ కింద రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో అడ్డంగా వచ్చే కరెంట్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లు, టెలికం లైన్లను తొలగించడం తరలింపు వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వం భరించాలి. రహదారి నిర్మాణ వ్యయం ఎక్కువగా ఉన్నందున కేంద్ర ప్రభుత్వం వెనకడుగు వేసింది. దీనిపై అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి లేఖ రాసింది. యుటిలిటీస్ తరలింపు వ్యయం భరించడం సాధ్యం కాదని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి లేఖ పంపించింది. దీంతో భూ సేకరణ ప్రక్రియ నిలిచిపోయింది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో భూ సేకరణ అంశంపై కదలిక వచ్చింది. సీఎం రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ రాశారు.

# ఓదార్పులకు దూరంగా జగన్

**ఎవరు ఆందోళన చేసినా ఒక్కటే**

**అంగన్‌వాడీల విషయంలోనూ అదే మంత్రం**



అమరావతి, జనవరి24(సమ సమాజం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి బాగా ఇష్టమైన ఓదార్పు ఇప్పుడు కనిపించడం లేదు. తన రాజకీయ ప్రస్థానంలో ఆయన ఓదార్పు యాత్రలతో ప్రజల వద్దకు వెళ్లేవారు. ఇప్పుడు ఎవరు ఆపదలో ఉన్నా వారికి ఓదార్పు దక్కడం లేదు. అంగన్‌వాడీలు రెండునెలలుగా సమ్మెచేస్తున్నా కనీసం వారిని ఓదార్చలేదు. అలాగే అమరావతి రైతులను ఐదేళ్లుగా దూరం పెట్టారు. అమరావతి రైతుల నుంచే ఆయన ఓదార్పు మంత్రాన్ని పక్కన పెట్టారు. ఇప్పుడు ఎలాంటి విషయంలోనూ ఓదార్పును ప్రకటించడం లేదు. అలాగే ఎవరు ఎలాంటి ఆందోళనతో ఉన్నా అస్సలు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. పాదయాత్రతో అమరావతి ఉద్యమాన్ని తారాస్థాయికి తీసుకుని వెళ్లినా చడీచప్పుడు లేకుండా పోయింది. అంగన్‌వాడీలు, మున్సిపల్ సిబ్బంది, టీచర్ల ఆందోళన వంటి విషయాల్లో కూడా జగన్ న ఓరు మెదపలేదు. ఇప్పుడు ఆందోళనలపై ఎక్కడా స్పందించకుండా ఉన్నారు. ఎంపిలు, ఎమ్మెల్యేలు తమ టిక్కెట్ల విషయంలో ఆందోళన చెందుతున్నా వారికి ఊరట దక్కడం లేదు. వారు కలసి తమ గోడు చెప్పుకుందామనుకున్నా..వారికి ఓదార్పు దక్కడం లేదు. ఆందోళన చేసిచేసి అమరావతి రైతులకు కూడా నీరసం వచ్చేలా చేయడంలో జగగన్ విజయం సాధించాలరనే చెప్పాలి. మొత్తంగా నాలుగున్నరేళ్లుగా రాజధాని అన్నది లేకుండా చేసుకున్న ఘనత జగన్‌కే దక్కుతుంది. ఇకపోతే సమస్య ఏదైనా ప్రజలు ఆందోళన చేస్తున్నా వారిని పలకరించి ఓదార్చడం లేదు. ఇందుకు తాజాగా ఉద్యోగుల ఆందోళనను కూడా చూడవచ్చు. అమరావతి విషయంలో జగన్ ధోరణి ఇందుకు విరుద్ధంగా ఉంది. గతంలో ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ప్రతిరోజూ తన క్యాంప్ కార్యాలయంలో ప్రజలను కలిసి విజ్ఞప్తులు స్వీకరించేవారు. ఆయన కుమారుడు జగన్మోహన్ రెడ్డి ఇందుకు పూర్తి భిన్నంగా పాలనా వ్యవహార శైలి సాగింది. తనకు నచ్చిన లేదా అవసరమైన అతి కొద్దిమంది వ్యక్తులను మినహా ఎవరినీ ఆయన కలవరన్న విమర్శలు ఉన్నాయి. రాజధాని అమరావతికి భూములు ఇచ్చిన రైతులతోపాటు ఇతర వర్గాల ప్రజలు ఆందోళన బాట పట్టినా జగన్మోహన్ రెడ్డి చలించ లేదు. వారిని కలసి ఓదార్చ లేదు. రైతులకు అపాయింట్‌మెంట్ ఇవ్వడానికి కూడా ఆయన ముందుకు రాలేదు. రైతులకు ఏమి కావాలో కనుక్కొని సమస్య పరిష్కరించండని కూడా అనలేదు. వారిని పెయిడ్ ఆర్టిస్టులుగానే చూశారు. రాజధాని విషయమై ప్రజలలో గందరగోళం నెలకొన్నప్పటికీ ఈ విషయంలో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి తాను పట్టిన రాజధానికి మూడు పట్టణాలు అన్న తీరులో కాలం గడిపారు. రైతులను చంద్రబాబు పెయిడ్ ఆర్టిస్టులుగా గుర్తించడం వల్లనే ఈ సమస్య వచ్చింది. మొత్తంగా సిఎం అయ్యాక జగన్ వైఖరి చాలా మందికి ఆశ్చర్యం కలిగిస్తున్నది. అంగన్‌వాడీలను ఉద్యోగాల నుంచి తొలగించమని ఆదేవాలు ఇచ్చారే తప్ప పిలిచి మాట్లాడా లని ఎక్కడా చెప్పలేదు. తమ ఆవేదనను ఎవరికి చెప్పుకోవాలో తెలియక అనేకవర్గావారు మదనపడు తున్నారు. జరుగుతున్న వ్యవహారమంతా ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడుపై కోపంతో అన్నది స్పష్టంగా తెలుసుకోవచ్చు. మొత్తంగా ఏపీలో రాజధాని మార్పుపై ఆందోళనలు జరిగినా.. ఏమీ చేయలేక పోయారన్న ధీమాలో సిఎం జగన్ ఉన్నారు. రాజధానిని మార్చడాన్ని సిఎం జగన్ చాలా సులువైన విషయంగా పరిగణించారు. అందుకే తాజాగా అంగన్‌వాడీలు కూడా డీలాపడేలా చేస్తున్నారు.

# బాబుకు బెయిల్‌పై సుప్రీంలో ప్రభుత్వం సవాల్




న్యూఢిల్లీ,జనవరి24(సమ సమాజం): ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు బెయిల్‌ను సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం సవాల్ చేసింది. ఐఆర్ఆర్ కేసులో ఈ నెల 10న చంద్రబాబుకు ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు తీర్పును ఏపీ ప్రభుత్వం సుప్రీంలో సవాలు చేసింది. చంద్రబాబు బయట ఉంటే సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందని ఏపీ ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఈ నెల 29న ఈ కేసు విచారణకు వచ్చే అవకాశం ఉంది. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ కేసులో అక్రమాలు జరిగాయని ఏపీలోని జగన్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఈ మేరకు గత ప్రభుత్వ హయాంలో స్కాం జరిగిందని సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో చంద్రబాబు పేరును కూడా చేర్చింది. అయితే అమరావతిలో ఇన్నర్ రింగ్ రోడ్డు వేయాలని నిర్ణయించారే తప్ప రోడ్డు వేయలేదని, భూసేకరణ జరగలేదని, పైసా నిధులు కూడా ఇవ్వలేదని, అలాంటప్పుడు అధికార దుర్వినియోగం, అవినీతి ఎలా జరుగుతుందని టీడీపీ ప్రశ్నిస్తోంది. రోడ్డు నిర్మాణం జరిగితే దాని వల్ల ఎవరైనా లబ్ది పొందారేమోనని అనుకోవచ్చుని, ఏదీ జరగకున్నా ఎవరికో లబ్ది జరిగిందని ఊహించి కేసులు పెడతారా? అని టీడీపీ ప్రశ్నిస్తోంది.

# పవన్ కళ్యాణ్‌తో గూరు ఎమ్మెల్యే వరప్రసాద్ భేటీ

**పార్టీలో చేరికపై జనసేనానితో చర్చ**

**పార్టీలో చేరిన జానీ మాస్టర్‌కు పవన్ ఆహ్వానం**





అమరావతి, జనవరి 24(సమ సమాజం): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి తరపున టికెట్ దక్కదని అనుకుంటున్న అభ్యర్థుల ఇతర పార్టీల వైపు చూస్తున్నారు. అధికార వైసీపీ అసంతృప్త నేతలు టీడీపీ, జనసేన వైపు చూస్తున్నాయి. కొత్తగా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇస్తున్నవారు తమకు నచ్చిన పార్టీల్లో చేరుతున్నారు. పార్టీ అధినేతలతో సమావేశమై సీటు ఖరారు చేసుకుంటున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలను వైఎస్ఆర్ సీపీ పార్టీ భారీగా మారుస్తోంది. టికెట్ రానీ వారు ఇతర పార్టీల్లోకి వెళుతున్నారు. ఆ జాబితాలో సీనియర్ నేత, గూడూరు వైసీపీ ఎమ్మెల్యే వరప్రసాద్ చేరారు. గూడూరు వైసీపీ టికెట్‌ను మేరీగ మురళికి కేటాయించారు. దాంతో జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో బుధవారం నాడు వరప్రసాద్ భేటీ అయ్యారు. పార్టీలో చేరే అంశంపై చర్చించారు. తిరుపతి నుంచి లోక్ సభకు పోటీ చేయాలని వరప్రసాద్ భావిస్తున్నారు. పవన్ కళ్యాణ్‌తో కొణతాల రామకృష్ణ సమావేశం అయ్యారు. జనసేనలో చేరాలని కొణతాల నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. అనకాపల్లి లోక్ సభ స్థానానికి జనసేన పార్టీ నుంచి పోటీ చేయాలని అనుకున్నారు. నేతల చేరికతో సెగ్మెంట్ల వారీగా పవన్ కళ్యాణ్ సమీక్ష చేస్తున్నారు. 35 సెగ్మెంట్లకు సంబంధించిన సమీక్ష చేశారు. ప్రధానంగా ఉభయ గోదావరి, ఉత్తరాంధ్రలోని సీట్ల ఖరారు చేయాలని పవన్ కళ్యాణ్ దృష్టిసారించారు. వచ్చే ఎన్నికల్లో ప్రచారంపై పవన్ కళ్యాణ్ నటుడు పృథ్వీ, జానీ మాస్టర్‌తో చర్చించారు. తాజాగా ప్రముఖ సినీ నృత్య దర్శకుడు షేక్ జానీ మాస్టర్ పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. బుధవారం మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో ఆయన చేరారు. పార్టీ కండువాను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*, Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
Printed at *Panidhar PUBLICATIONS.* Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, ***Editor: GOSUKONDA PRUDHVIRAJU***,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in